క్లుప్తంగా

160 పొగాకు బేళ్ల కొనుగోలు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్ కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో 160 బేళ్లు కొనుగోలు అయ్యాయని వేలం నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం తంగెళ్ల, జాల్లపాలెం, పీరాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 226 బేళ్లను తీసుకుని వచ్చారు. అందులో 160 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 66 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 280, కనిష్ట ధర రూ 270, సరాసరి ధర 277.25 వేలంలో పది కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

మహిళా రక్షణ, భద్రతకే యాప్



శక్తి యాప్‌ను, టీంను ప్రారంభిస్తున్న డీఎస్పీ

కనిగిరిరూరల్: మహిళా, బాలిక రక్షణ, భద్రతకే శక్తి యాప్ అని డీఎస్పీ పి సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శక్తి యాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలకు, బాలికలకు ప్రత్యేక సేవలు అందించుటకు శక్తి యాప్ ద్వార పోలీస్ శాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈమేరకు కనిగిరి శక్తి టీం ఏర్పాటు చేశారు. సేవలను మరింత విస్తృతంగా, త్వరగా అందించేందుకు శక్తి టీం పనిచేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై టీ శ్రీరాం తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ గవదగట్లవారిపాలేనికి చెందిన మామిడి రైతు సంపతి ప్రభాకర్‌పై గురువారం రాత్రి ఎస్సీ,ఎస్టీ కేసు నమోదైంది. ప్రభాకర్ తన మామిడి తోటలో పురుగుమందు కొట్టడానికి అడ్వాన్స్ తీసుకుని పనికి ఆలస్యంగా వచ్చిన రాపూరి అంజయ్యను కులం పేరుతో దూషించి కొట్టడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీ మహేంద్ర తెలిపారు.

ఉగాది సందర్భంగా షాపులకు వేలం

కొండపి: మండలంలోని జాల్లపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానంలో ఉగాది మహోత్సవ సందర్భంగా లీజు హక్కులకు ఈనెల 19న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో కొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకొని హక్కు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకొని హక్కు, ఎండు కొబ్బరి చిప్పలు అమ్ముకొని హక్కు, ప్రసాదాలు అమ్ముకొని హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.25 వేల ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు. ఎవరు అయితే పాటలో అధిక ధర చెల్లిస్తారో వారికి మాత్రమే లీజు ఇవ్వబడుతుందని, పాట ముగిసిన వెంటనే పాట మొత్తం సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొను పాటదారుడు తమ చిరునామా రుజువు చేయు పత్రం ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో సెల్ నెంబర్‌ను పాట నిర్వహించు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరైతే అధిక ధరకు వేలం పాటలో దక్కించుకుంటారు వారి స్వయంగా వ్యాపారం చేసుకోవాలని, సబ్ లీజులు, మార్పులు చేయరాదని, అలా చేస్తే ఎవరైనా చేస్తే వారి లీజు రద్దు చేస్తామని తెలిపారు.

ఫైన్ పడుద్ది.. బ్రదరూ !

- మూడు నెలల్లో రూ. 12.50 లక్షల జరిమానా వసూలు
- అమలులోకి వచ్చిన నూతన నిబంధనలు
- వాహనదారుల్లో కనిపించని మార్పు

టంగుటూరు:

వాహనదారులు ఇక జాగ్రత్త పడాల్సిందే. నూతన నిబంధనలు పాటించాల్సిందే లేదంటే భారీ జరిమానాలు విధిస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటివరకు సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ పోలీసు స్టేషన్ల పరిధిలో గడిచిన కాలంగా జరిగిన ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. హెల్మెట్, మద్యం తాగడం వలనే ప్రమాదాలు జరిగాయని పోలీసు అధికారులు చెప్తున్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రజలకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. గడిచిన మూడు నెలల్లో



టంగుటూరు టోల్ వద్ద ప్రజలకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

హెల్మెట్ లేకపోవడంతో 1550 మందికి రూ. 2,9 లక్షలు జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 150 మంది పట్టుబడగా వారికి రూ.7.50 లక్షలు జరిమానా విధించారు. ట్రిపుల్ రైడింగ్, ఇన్సూరెన్స్, సరైన పత్రాలు లేని వాహనదారులకు మరో రూ. 2 లక్షలు జరిమానా విధించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జరిమానా లేదా జైలే..

నూతన మోటారు వాహన చట్టం ప్రకారం జీవో నంబరు 21 ప్రకారం మైనర్లు వాహనాలు నడిపితే పెద్దవారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త వాహన చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ. 5 వేలు జరిమానా లేదా మూడు సంవత్సరాలు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి.

- లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ. 5 వేలు, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ. 1000, వెనుక కూర్చున్న వారికి కూడా రూ. 1000 జరిమానా, రెండోసారి దొరికితే మూడు నెలల పాటు లైసెన్సులు రద్దు. అతివేగంగా వాహనం నడిపితే రూ. 1000 జరిమానా విధిస్తారు.
- రాంగ్ రూటులో వాహనం నడిపితే రూ. 5 వేలు, రెండోసారి పట్టుబడితే రూ. 10 వేలు జరిమానా
- మద్యం తాగి పట్టుబడితే రూ. 10 వేలు జరిమానా, సీటు బెల్టు ధరించకపోతే రూ. 1000, రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు మూడు నెలల లైసెన్సు రద్దు.
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళ్తే రూ.10 వేల జరిమానా, బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ పట్టుబడితే రూ. 1000, మూడు నెలల పాటు లైసెన్సు రద్దు. ఇన్సూరెన్సు లేకుండా వాహనాలు నిడిపితే రూ. 2 వేలు, శబ్దం, పొగ కాలుష్యానికి పాల్పడితే రూ. 2 వేలు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే రూ. 1500, రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తారు.

పెద్దలు, ప్రజల్లో మార్పు రావాలి..



కొత్త వాహన చట్టం ప్రకారం నిబంధనలు కఠినంగా ఉన్నాయి. నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే భారీ జరిమానా లేదా జైలుకు వెళ్లే అవకాశాలు ఎక్కువ. వాహనాలు పట్టుబడినప్పుడు రాజకీయ నాయకులతో లేదా పలుకుబడి ఉన్న నాయకుల చేత ఫోన్లు చేయించొద్దు. ప్రతి ఒక్కరూ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి..

– చావా హజరత్తయ్య, సింగరాయకొండ, సీఐ

కఠిన చర్యలు తప్పవు..



నూతన మోటారు వాహన చట్టంలోని నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రమాదాల నియంత్రణకు ప్రభుత్వం నూతన మోటారు వాహన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. రహదారి పక్కన వాహనాలు నిలపరాదు. వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలి. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలి.

– టంగుటూరు ఎస్సై, నాగమల్లీశ్వరరావు

ముమ్మరంగా పొగాకు గ్రేడింగ్ పనులు



పొగాకు కట్టలు కడుతున్న కూలీలు



పొగాకు గ్రేడింగ్ పనుల్లో కూలీలు

- మిగతా కేంద్రాల్లో ఆశా జనకంగా లేని పొగాకు ధరలు

కనిగిరిరూరల్: నియోజకవర్గంలో పొగాకు గ్రేడింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని మండలాల్లో గ్రేడింగ్‌లు పూర్తి కాగా మరికొన్ని చోట్ల గ్రేడింగ్, చెక్కులు కట్టే పనులు జరుగుతున్నాయి. పొగాకు క్యూరింగ్ పనులు దాదాపు 75 శాతంకు పైగా పూర్తైనట్లు రైతులు చెప్తున్నారు. ఈనెల 19 నుంచి పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటికే మిగతా పొగాకు కేంద్రాల్లో పొగాకుకు పలుకుతున్న ధరలు కనిగిరి టుబాకో పరిధిలోని పొగాకు రైతులను డీలా పడేటట్లు చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సరాసరి ధర, ఉన్నత ధర బాగా తగ్గింది. దీంతో పొగాకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

గ్రేడింగ్ పనుల్లో రైతుల నిమగ్నం..

దీంతో ఆయా గ్రామాల్లో పొగాకు రైతులు గ్రేడింగ్, బేళ్లు, చెక్కుల తయారీ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పొగాకును 1,2,3, సూరా, పచ్చ అనే ఐదు రకాలుగా గ్రేడింగ్ చేస్తున్నారు. ఒక్కో చెక్కును 150 కిలోల్లోపు ఉండేలా బేళ్లు సిద్ధం చేస్తున్నారు. గ్రేడింగ్ చేసిన పొగాకు రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గాలి తగలని ప్రదేశాల్లో పొగాకు మండెలు వేసి, పదును ఆరకుండా చర్యలు తీసుకుంటున్నారు. పొగాకు గ్రేడింగ్ పనులతో వందలాది మహిళలకు ఉపాధి పొందుతున్నారు. గ్రేడింగ్ సమయంలో రైతులు, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెప్తున్నారు. గ్రేడింగ్ హాలులో టార్పాలిన్ పట్టలు వేసి ఇతర అన్యపదార్థాలు కలువకుండా కూలీ వద్ద అట్ట పెట్టెల వంటివి ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఆశాజనకంగా దిగుబడులు ..

ఈ ఏడాది పొగాకు దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే దాని తగ్గట్టు పంట పెట్టుబడి ఖర్చులు భారిగా పెరిగినట్లు రైతులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే కౌలు ధరలు, బ్యారన్ ధరలు, కూలీల రేట్లు బాగా పెరిగాయి. దానికి తగ్గట్టు పొగాకు ధరలు మార్కెట్లో ఎలా ఉంటాయనేది ప్రశ్నార్థకం.



కర్రకు అల్లిన పొగాకు

కనిగిరి టుబాకో బోర్డు పరిధిలో	
బ్యారన్‌ల సంఖ్య	1,245
పొగాకు సాగు విస్తీర్ణం	4,952 హెక్టార్లు
పొగాకు ఉత్పత్తి	8.5 మిలియన్ కేజీలు
క్లస్టర్ల సంఖ్య	5 (తుమ్మగుంట, పామూరు, పెదఅలవలపాడు, కేపీ అగ్రహారం, చాకిరాల)

ప్రస్తుతం పొగాకు వేలం కేంద్రాల్లో కేజీ పొగాకు ధర సరాసరిన రూ.275 ఉండగా.. అత్యధిక ధర రూ.280 పలుకుతుంది. ఈ ధరలపై పొగాకు రైతులు నిరాశగా ఉన్నారు. ధరలు గతేడాది కంటే ధరలు తగ్గి రేట్లు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ముస్లింలతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

పామూరు: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండలకేంద్రమైన పామూరులోని నాలుగు మసీదుల పరిధిలో ఉపవాసం ఉంటున్న ముస్లింలకు శుక్రవారం రాత్రి స్థానిక విరువూరురోడ్డులో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్ చాంద్‌బాషా, నాలుగో ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాడు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ హాజరై ఇఫ్తార్ విందు స్వీకరించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం దువా నిర్వహించి ఇఫ్తార్‌విందు ఆరగించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, గుంటక తిరుపతిరెడ్డి, కోఆప్షన్ నాయబ్ రసూల్, కల్లూరి రామిరెడ్డి, యూత్ మండల ధ్యక్షుడు యాదాల సాయికిరణ్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మైనారిటీసెల్ అధ్యక్షుడు షేక్.గయాజ్, చల్లా సుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, ఎస్టీ సెల్ శ్రీరాం శ్రీను, కటికల వెంకటరత్నం, ఎంపీటీ నాయబ్‌రసూల్, మర్రి రాజుయాదవ్, స్వర్ణ ఏడుకొండలు, షేక్.కాలేషా, షేక్.రసూల్, మీరామొహిద్దీన్, రాజు, సిటిజన్ నాయబ్‌రసూల్, మస్తాన్, మన్నం మాధవ, సీహెచ్.మల్లికార్జునరెడ్డి, పాలేటి ప్రేమ్, షేక్.నాయబ్, సుబాని, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, దేవిరెడ్డి వెంకటస్వామి, ఈర్ల శ్రీను, మోటు, కంటు కేశవ, ఇర్రి వెంకటేశ్వరరెడ్డి, పలువురు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో చైర్మన్ గఫార్, ఎస్పీ నాయకులు వెంకటేశ్వర్లు

కనిగిరిరూరల్: మతసామరస్యం, సౌభ్రాతృత్వం, స్నేహభావం పెంపుదలకు ఇఫ్తార్ విందులు దోహదపడుతాయని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్‌అన్నారు. స్థానిక షాదీఖానలో సమాజ్‌వాదీ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్కే నజీర్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ దువా, దావత్(విందు) కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు, పలువురు పట్టణ ప్రముఖులు, బీసీ, నాయకులు ఎస్కే గయాజ్ బాషా, సయ్యద్ నాయబ్ రసూల్, పట్నం నరసింహులు, ఈర్ల విజయరామరాజు పాల్గొన్నారు.

గిద్దలూరు సదస్సుకు తరలిన ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): 'ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై జిల్లాలోని గిద్దలూరులో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరుగుతున్న విద్యా సదస్సుకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, కమ్మనేతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో నిర్వహించాల్సిన పాత్రను, ఏపీటీఎఫ్ అందించిన ఉద్యమస్ఫూర్తి అంశాలపై సదస్సు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామకృష్ణ, మల్లికార్జునరాజు, పున్నమ్మ, ఎలిజబెత్, తరలివెళ్లారు.



సదస్సుకు తరలివెళ్తున్న ఉపాధ్యాయులు

ముసీపై నేల చప్టా నిర్మాణం చేయాలి

కొండపి: ముసీ నదిపై నేల చప్టా నిర్మాణం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ముప్పవరం, మిట్టపాలెం, పెరిదేపి గ్రామాల్లో పర్యటించారు. సీపీఎం బృందానికి ప్రజలు చప్టా నిర్మాణం చేస్తే ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా కొండపి రావడానికి సుమారు 40 కిలో మీటర్లు దూరం ఉంటుందని, అదే ఇక్కడ చప్టా నిర్మాణం చేయడం ద్వారా దూరం 26 కిలోమీటర్ల ఉంటుందన్నారు. పొందూరు నుంచి కొండేపి చుట్టు పక్కల ఉన్న అనేక గ్రామాలకు ఈ రహదారి మార్గం చాలా సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య మండల నాయకులు వందనం, సుధాకర్, సురేష్,అంకయ్య, ఏడుకొండలు, గోపి, నవీన్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



చప్టా నిర్మించాలని నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు

వలసబాట పట్టిన మూగ జీవాలు



పచ్చిక దొరికే ప్రాంతాలకు వెళ్తున్న జీవాలు

హనుమంతునిపాడు: మండలంలో మూగ జీవాల వలసలు మొదలయ్యాయి. తీవ్రంగా కాస్తున్న ఎండలకు ఎక్కడా చుక్క నీరు దొరికే వనరులు లేవు. గుంతలు, కుంట, చెరువుల్లో నీరు కూడా ఎండిపోయాయి. పచ్చిక కూడా దొరికే ప్రాంతాలు లేవు. ఎక్కువగా ఈ ప్రాంతంలో గొర్రెలు, మేకలు, గేదెల పోషకులు ఎక్కువగా ఉంటారు. వాటిపై ఆధార పడి జీవిస్తున్నారు. పచ్చిక నీరు దొరికే ప్రాంతాలైన దర్శి, కురిచేడు, వినుకొండ, అద్దంకి, ప్రాంతాలకు గొర్రెల కాపరులు జీవాలను తోలుకొని వెళ్తున్నారు. వర్షాలు మొదలైనంత వరకు అక్కడే గొర్రెలను మేపుకుంటూ ఉంటారు. వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీరు రానంత వరకు పశ్చిమ ప్రాంత ప్రజలకు కష్టాలు తప్పవని గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హోలీ వేడుకల్లో చిన్నారుల సందడి

పొన్నలూరు: హోలీ పండుగ సందర్భంగా చిన్నారులు, యువకులు శుక్రవారం సందడి చేశారు. ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేస్తూ ఒకరిపై ఒకరు గులాములు చల్లుకుంటూ హంగామా చేశారు. గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున హోలీ సంబరాల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. అక్కడక్కడ మహిళలు, యువతులు కూడా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

కొండపి: మండలంలో హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఇక చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున హోలీ వేడుకలు జరుపుకొని సంతోషం వ్యక్తం చేశారు. యువకులు డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకలు నిర్వహించారు.

పామూరు/కనిగిరిరూరల్: హోలి వేడుకలు కనిగిరిలో, మండలకేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో చిన్నారులు ఆనందోత్సాహాల నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హోలి వేడుకలను ప్రతియేటా పాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం,ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యువత రకరకాల రంగులను సేకరించుకుని కేరింతల నడుమ ఒకరిపై ఒకరు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు.



కనిగిరిలో హోలీలో సందడి చేస్తున్న విద్యార్థినులు



రంగులు చల్లుకుంటున్న విద్యార్థినులు



హెచ్‌ఎంపాడులో కేరింతలు కొడుతూ రంగునీళ్లు చల్లుకుంటూ హోలి ఆడుతున్న చిన్నారులు..



పామూరులో రంగులు చల్లుకుంటున్న యువత



పొన్నలూరులో హోలీ సంబరాల్లో చిన్నారులు



కొండపిలో రంగులు పూసుకొని కేరింతలు కొడుతున్న చిన్నారులు

రేపు మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో రేపు 16వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్ హాజరుకావాలన్నారు. అదేవిధంగా అన్నిశాఖల అధికారులు సంబంధిత వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.